## పీజీ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లించాలి

డిచ్‌పల్లి, డిసెంబర్ 7 : టీయూ అనుబంధ కళాశాలల పరిధిలోని పీజీ పరీక్షల ఫీజును విద్యార్థులు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎల్ఎల్‌బీ, ఐదు సంవత్సరాల ఏపీఈ, పీసీహెచ్, ఐఎంబీఏ 3, 5, 7, 9వ రెగ్యులర్ పరీక్షలకు ఫీజు తేదీని ప్రకటించామని పేర్కొన్నారు. ఫీజు చెల్లించేందుకు ఈనెల 12వ తేదీ వరకు గడువు ఉన్నదని, రూ.100 అపరాధ రుసుముతో ఈనెల 15 వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## ఉచిత ఆయుర్వేద శిబిరం




బ్రాహ్మణ్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 7 : మండలంలోని బ్రాహ్మణ్‌పల్లిలో ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని డాక్టర్ లలిత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, కీళ్లనొప్పులు, రుతుక్రమానికి సంబంధించిన సమస్యలు, చర్మరోగాలు, అజీర్ణం, పక్షవాతం తదితర రోగాలకు మందులను సరఫరా చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లతాదేవరాజ్, ఎంపీటీసీ పోతే రాజు, సెక్రటరీ హరీశ్, ఫార్మాసిస్ట్ వరలక్ష్మి, నవనీత, ఏఎన్ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

## జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

ధర్పల్లి (సిరికొండ), డిసెంబర్ 7 : ధర్పల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేశ్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, హెల్త్, ప్రమాద ఇన్సూరెన్స్‌తోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అంతకుముందు గ్రామ పంచాయతీ కార్మికులు ధర్పల్లిలో ధర్నా చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు, నాయకులు ఆశన్న, సాయిలు, భోజన్న, విలాస్, గంగాధర్, సులోచన, సాయవ్వ, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ఎమ్మెల్యేను కలిసిన జిల్లా నాయకులు



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 7: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావును సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సీపీఐ నాయకుడు వై.ఓమయ్య గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని సాంబశివరావు అన్నారు.

# ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవం చేయించుకోవాలి

### ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్

డిచ్‌పల్లి/ ఇందల్వాయి, డిసెంబర్ 7 : గర్భిణులు ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవం చేయించుకోవాలని ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ సూచించారు. డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఘన్‌పూర్‌లో ఉన్న పల్లె దవాఖానలో, ఇందల్వాయి మండలంలోని గన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, సుఖ ప్రసవమైన వారితో ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సిజేరియన్, సాధారణ కాన్పు మధ్య తేడాలు, ఆరోగ్య పరిస్థితులను వివరించారు. గ్రామంలోని ప్రభుత్వ దవాఖానలో సాధారణ ప్రసవమైన గర్భిణి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఘన్‌పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పల్లె దవాఖాన ఎంఎల్‌హెచ్‌పీ గంగాభవాని, ఏఎన్ఎంలు గొల్లపల్లి శైలజ, రజిత పాల్గొన్నారు. గన్నారంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కార్యకర్త శారద, ఇందిర, ఎంఎల్‌హెచ్‌పీ సంతోషి, ఆనంద్, అంగన్‌వాడీ టీచర్ గంగామణి, ఆశ కార్యకర్తలు సుష్మ, గంగలక్ష్మి, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



గన్నారంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్

# పోచారానికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



పోచారం శ్రీనివాసరెడ్డితో సులేమాన్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు

రుద్రూర్, డిసెంబర్ 7 : మండలకేంద్రంలోని సులేమాన్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని గురువారం కలిశారు. హైదరాబాద్‌లోని పోచారం శ్రీనివాసరెడ్డిని తన ఇంట్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో తనకు సులేమాన్‌నగర్ నుంచి 466 ఓట్ల మెజారిటీ ఇచ్చినందుకు పోచారం శ్రీనివాసరెడ్డి గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. సులేమాన్‌నగర్ సర్పంచ్ ఖాదర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు హబీబ్, బూత్ కన్వీనర్ గౌస్, పార్టీ గ్రామ కార్యదర్శి కుద్రత్ ఖాన్, సీనియర్ కార్యకర్తలు అఖిల్, సలీం, సాబీర్ అలీ, లింగంగౌడ్, సురేశ్, షాదుల్, అలీమ్‌ఖాన్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు గీతా సత్సంగం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 7 : జిల్లాకేంద్రంలోని గీతాభవన్‌లో శుక్రవారం గీతా సత్సంగాన్ని నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ భగవద్గీత కేంద్రప్రచార మండలి అధ్యక్షుడు నర్సింహాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ధార్మికవేత్త బొడ్డు దయానంద్ గీతా ప్రవచనాన్ని చెబుతారని పేర్కొన్నారు. సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు సత్సంగం, ధార్మిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా ఆలయ శిఖర ప్రతిష్ఠాపన

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 7 : జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్ పరిధిలో ఉన్న షిర్డీ సాయికృపానగర్ వద్ద భూలక్ష్మి మాత ఆలయ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధి ఆకుల శ్రీశైలం మాట్లాడుతూ.. కార్తిక బహుళ దశమి గురువారం పురస్కరించుకొని నూతన శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మధుసూదన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తోట గోపాల్, గంగారెడ్డి, విలాస్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.



శిఖరానికి పూజచేస్తున్న భక్తులు

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు చందూర్ పాఠశాల విద్యార్థులు

చందూర్, డిసెంబర్ 7 : మండలకేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జి వంశీ, (ఇంటర్), బి. రమాకాంత్ (పదోతరగతి) రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్, పీఈటీ సాయిబాబా తెలిపారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా నందిపేటలో నిర్వహించే 34వ జూనియర్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వంశీ, రమాకాంత్

# నర్సరీల్లో పండ్ల మొక్కలను పెంచాలి



నడిపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో చందర్‌నాయక్

డిచ్‌పల్లి, డిసెంబర్ 7 : ప్రజలకు ఉపయోగపడే పండ్ల మొక్కలను నర్సరీల్లో పెంచేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్డీవో బదావత్ చందర్‌నాయక్ సూచించారు. మండలంలోని నడ్పల్లి, నక్కలగుంట తండా నర్సరీలను ఏపీవో సుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. ఒక్కో నర్సరీలో 30 వేల మొక్కలు పెంచేందుకు ఇప్పటికే లక్ష్యంగా నిర్ణయించామని, అందుకు అనుగుణంగా నర్సరీలో మొక్కల పెంపకానికి బ్యాగ్ ఫిల్లింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బ్యాగ్‌ఫిల్లింగ్ ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్‌రావు, చంద్రకాంత్, మేటు మహిపాల్, పంచాయతీ సిబ్బంది రాము, సంతోష్, బాబా తదితరులు ఉన్నారు.